క్లుప్తంగా

పిల్లలు సెల్ ఫోన్‌కు దూరంగా ఉండాలి



వేమన శతకం పద్యం వినిపిస్తున్న చిన్నారి

శ్రీకాకుళం అర్బన్: పిల్లలు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలని బలగ గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయంలో శనివారం పిల్లలతో వేమన శతకం పద్యాలు చదివించారు. అలాగే ఆటలు ఆడించారు. పిల్లలు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలంటే గ్రంథాలయాలకు తీసుకువచ్చి వేసవి శిక్షణ శిబిరాలను చూపించాలని తల్లిదండ్రులను కోరారు. గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత ఉన్నారు.

'వంశధార గట్టు తవ్వకం నేరమే'



తవ్వకాలు జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గార: వంశధార గట్టులో ఉన్న మట్టి లేదా మట్టితో కూడిన ఇసుక కోసం తవ్వకాలు చేయడం చట్టరీత్యా నేరమేనని డీఈఈ జనార్దన్ స్పష్టం చేశారు. మండల కేంద్రం గారలో అర్ధరాత్రి వేళలో వంశధార గట్టు తవ్వకాలు జరగడంపై ఈ నెల 24 తేదీన 'వంశధార గట్టుపై తవ్వకాలు'శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమయ్యింది. దీంతో శనివారం వంశధార తీరప్రాంత అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి గట్టు తవ్వకాలు జరిగినట్టు గుర్తించారు. పోలీస్‌స్టేషన్‌కు సమాచారమిచ్చారు. ఈ విధంగా తవ్వకాలు చేయడం వలన వరదల సమయంలో ఇబ్బందులు పడతామని, దీన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పోలీసులను కోరారు. గట్టు తవ్వకాలు జరిగితే పోలీసులు, అధికారులకు ప్రజలు తెలియజేయాలని కోరారు.

గార పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

గార: గార పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక శనివారం సాయంత్రం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమైన కేసులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అన్ని గ్రామాలను సీఐ, ఎస్సైలు సందర్శించాలని, ఎటువంటి గొడవలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలు చేయడంతో పాటు ఎటువంటి అల్లర్లు, ఘర్షణలు చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్సై కె.కృష్ణప్రసాద్ ఉన్నారు.

29న గణిత అష్టావధానం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో ఈనెల 29న గణిత అష్టావధానం జరుగుతుందని నిర్వాహకులు గుమ్మా నగేష్, కామేశ్వరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో విద్యాసంస్థలలో వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్న విశ్రాంత గణిత ఉపాధ్యాయులు నిష్టల నర్సింహమూర్తిచే బాపూజీ కళామందిరంలో ఆ రోజు సాయంత్రం 5.30 గంటలకు అష్టావధానం ఉంటుందన్నారు. ఇందులో వర్గములు, ఘనములు, గుణకారములు, మాయాచదరం, కేలండర్ తదితర అంశాలపై అవాధానం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు క్యాలిక్యులేటర్లతో హాజరు కావాలని కోరారు.

ఇంటర్ పరీక్షలకు 369 మంది గైర్హాజరు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా కొనసాగుతున్నాయి. రెండోరోజు శనివారం 10,385 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 369 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 51 కేంద్రాల్లో జరుగుతున్న ఈ పరీక్షల్లో భాగంగా శనివారం ఇంగ్లిష్ పేపర్‌కు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం ఫస్టియర్ విద్యార్థులు 9,402 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 9,083 మంది పరీక్ష రాశారు. 319 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెకెండియర్ విద్యార్థులు 983 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 933 మంది హాజరయ్యారు. 50 మంది డుమ్మాకొట్టారు. డీవీఈవో కోట ప్రకాశరావు, ఆర్ఐవో ప్రగడ దుర్గారావు, డీఈసీ కమిటీ సభ్యులు బొమ్మలాట శ్యామ్‌సుందర్, గూణ సింహాచలం, కీర్తి తవిటినాయుడు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు చేశారు.

● చల్లపేటలో కార్డన్ సెర్చ్



అంపోలు పంచాయతీ చల్లపేట గ్రామంలో శుక్రవారం వేకువజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్సై కె.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ బృందం గ్రామంలోని వీధులన్ని జల్లెడ పట్టారు. వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేని నాలుగు వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. అయితే యజమానులు సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ధ్రువపత్రాలు అందించడంతో వాహనాలను తిరిగి అప్పగించారు. -గార

● 104 వాహనం తనిఖీ



శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో గల 104 వాహనాన్ని ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ప్రకాశ్ రావు శనివారం తనిఖీలు చేశారు. ఆరోగ్యశ్రీ సీఈవో ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందన్నారు. 104 వాహనంలో బీపీ మిషన్, స్టెతస్కోప్ వంటి పరికరాలను, రికార్డులను వారు పరిశీలించారు. శ్రీకాకుళం డివిజన్ ఓఈ శివాజీ, డీఈవో భవానీ ఉన్నారు. -శ్రీకాకుళం రూరల్

● కోలాట అర్చన



శ్రీకాకుళం నగరంలోని కాకివీధిలో జరుగుతున్న ముత్యాలమ్మతల్లి పండుగ సందర్భంగా శనివారం కోలాట అర్చనలు జరిగాయి. సాంస్కృతిక ప్రదర్శనలలో భాగంగా ముత్యాలమ్మతల్లి కోలాట బృందం ఆధ్వర్యంలో 60 మంది కోలాట ప్రదర్శన చేసి అమ్మవారికి అర్చన చేశారు. కార్యక్రమంలో దమ్మల అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. -శ్రీకాకుళం కల్చరల్

'తూనికల యంత్రాలకు రెన్యూవల్ తప్పనిసరి'



తనిఖీలు చేస్తున్న తూనికల, కొలతల అధికారి రాజా రమేష్

రణస్థలం: వ్యాపారులందరూ తమ తూనికలు, కొలతల యంత్రాలకు ప్రతీ ఏడాది తప్పక రెన్యూవల్ చేయించుకోవాలని శ్రీకాకుళం డివిజన్ అధికారి కె.రాజా రమేష్ సూచించారు. మండల కేంద్రంలోని షాదీఖానా కల్యాణ మండపంలో రణస్థలం మండల వ్యాపారుల తూనికలు, కొలతలు రిజిస్ట్రేషన్ల పునరుద్ధరణ శిబిరం శనివారం నిర్వహించారు. తూనికలు, కొలతల యంత్రాలకు సీల్‌లు వేశారు. పనిచేయని మిషన్లకు మరమ్మతులు చేశారు. ఎలక్ట్రికల్ యంత్రాలకు ప్రతీ ఏడాదికి, తూనిక రాళ్లలకు రెండు సంవత్సరాలకు సీలు వేయించుకోవాలని చెప్పారు. అలాగే ప్రతీ ఏడాది రణస్థలంలో ఏప్రిల్, జూన్ మాసాల్లో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తామని చెప్పారు.

రేషన్ అందించే ఎండీఎం వాహనాల యాజమానులు తప్పనిసరిగా సీల్‌లు వేయించుకోవాలని, ఉన్నతాధికారులు అదేశాల మేరకు ఈ వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆకస్మిక తనిఖీల సమయంలో రెన్యూవల్ చేయించకపోతే అపరాధ రుసుంతో పాటు సంబంధిత షాపులు సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో తూనికల, కొలతల టెక్నికల్ అసిస్టెంట్ ఎస్.భార్గవి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక అలంకరణ



దూదివారి కోవెలలో పూలమాలల అలంకరణలో వేంకటేశ్వరస్వామివారు



మొండేటివీధిలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణ జరిగాయి. ఆలయ అర్చకులు పట్నాల రామకృష్ణ, శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. అలాగే చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా పూజలు జరిగాయి. స్వామివారిని తులసీదళాలతో, పూలమాలలతో అలంకరించారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ఆక్రమణలు అడ్డగింత



పనులను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో చెరువుల ఆక్రమణలు శృతి మించుతున్నాయి. ఇటీవల రాజుల చెరువు, గోరువాని చెరువు గట్టులను, కొత్తకర్ర చెరువు గర్భంలో ఇంటి నిర్మాణానికి కొంత స్థలాన్ని ఆక్రమణలకు పాల్పడగా అధికారులు స్పందించి అడ్డుకున్నారు. ఇప్పుడు తాజాగా నరసన్న చెరువు గర్భాన్ని రెడ్డికిపేటకు వెళ్లే దారిలో కొందరు శనివారం మట్టిపోసి ఆక్రమణలకు పాల్పడ్డారు.

ఈ సమాచారం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు లక్ష్మణరావు, వీఆర్ఏ రామారావు, సర్వే చైన్‌మెన్ రవి తహసీల్దార్ కనకారావు ఆదేశాలతో వెళ్లి మట్టి కప్పడాన్ని అడ్డుకున్నారు. గొట్టిపల్లి రెవెన్యూ 94/1 సర్వే నంబర్‌లో నరసన్నపేట చెరువు ఉందని, కొంతభాగం ఎన్‌హెచ్‌లో పోగా మిగిలిన భాగం రోడ్డుకు రెండు వైపులా ఉంది. దీంట్లో కొంత భాగాన్ని రెడ్డికిపేట వైపు ఆక్రమణదారులు శుక్రవారం రాత్రి మట్టిపోసి కప్పుతున్నారు. ఇక్కడ సెంటు స్థలం రూ.10 లక్షలకు పైనే పలుకుతోంది. దీంతో చెరువు భాగాన్ని ఆక్రమించుకోవడానికి కొందరు ప్రయత్నించగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. అనుమతి లేకుండా చెరువులు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



చెరువు గర్భంలో మట్టిపోస్తున్న ఆక్రమణదారులు

ఉద్యానవన పంటలపై ప్రత్యేక దృష్టి



సమీక్ష నిర్వహిస్తున్న ఏపీడీ మురళీకృష్ణ

సారవకోట: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఉపాధి హామీ పథకం ఏపీడీ మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన మండలంలోని అన్నుపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, అనంతరం స్థానిక కార్యాలయంలో సిబ్బందితో పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 సెంట్లు నుంచి 5 ఎకరాల వరకు భూమి కలిగిన రైతులకు ఉద్యానవన పంటలైన మామిడి, సపోటా, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, ఆయిల్ ఫాం తదితర పంటల పెంపకానికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడు సంవత్సరాల పాటు మొక్కల పెంపకానికి అయ్యే నిర్వహణ ఖర్చును ఉపాధి హామీ పథకం ద్వారా అందించనున్నట్లు తెలిపారు. సారవకోట మండలంలో 70 పనులు జరుగుతున్నాయని, 9,300 మంది వేతనదారులు పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు ఏపీవో నారాయణరావు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పొందూరు: వేంకటేశ్వరుని కల్యాణానికి రాట వేస్తున్న దృశ్యం



నరసన్నపేట: చంద్రప్రభ వాహన సేవలో వేంకటేశ్వర స్వామి



ఎల్.ఎన్.పేట: అమ్మవారి జంగిడి ఊరేగిస్తున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామ సమీపంలో వంశధార నదీతీరంలో కొలువైన బంగారమ్మ తల్లి అమ్మవారి పెద్ద పండగల్లో భాగంగా అమ్మవారి జంగిడి ఊరేగింపు కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈనెల 28వ తేదీ వరకు జరగనున్న అమ్మవారి పెద్ద పండగల్లో భాగంగా జంగిడి ఊరేగింపుగా తీసుకుని వెళ్లి, అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. పండగలకు వస్తున్న బంధువులు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అమ్మవారికి పూజలు నిర్వహించేందుకు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు.

చంద్రప్రభ వాహన సేవ

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం స్వామివారికి చంద్రప్రభ వాహన సేవ నిర్వహించారు. పెద్దపేటతో పాటు ప్రధాన వీధుల్లో చంద్రప్రభ వాహనంలో స్వామివారు ఊరేగారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి జాతర ప్రారంభం

పొందూరు: మండలంలోని తండ్యాం పంచాయతీ పరిధి మన్నెపేట కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామి 33వ జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అలివేలి మంగమ్మ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణానికి రుత్వికులు గన్నవరపు రాంబాబు కల్యాణ రాట వేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు తిరువీధి మహోత్సవం జరిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమష్టిగా అభివృద్ధి చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ కిల్లి రమాదేవి

సరుబుజ్జిలి: సభ్యులందరం సమష్టిగా మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ కిల్లి రమాదేవి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి పూర్తిస్థాయి సిబ్బంది హాజరవ్వకపోవడంతో కాకపోవడంతో పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు కోసం చర్చించే సమయంలో పూర్తిస్థాయి అధికారులు లేకపోవడం వలన సమావేశాలు పెట్టినా ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ ఉండడంతో శాఖల వారీగా చర్చ నిర్వహించకుండానే తూతూమంత్రంగా ముగించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ జీవీ శివానందమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జైల్లో సౌకర్యాలపై ఆరా



మాట్లాడుతున్న జడ్జి హరిప్రియ

నరసన్నపేట: స్థానిక సబ్ జైలులో రిమాండ్ ఖైదీలతో పాటు ఇతర ఖైదీలకు అందుతున్న సదుపాయాలపై నరసన్నపేట కోర్టు సివిల్ జడ్జి సి.హరిప్రియ ఆరా తీశారు. శనివారం జైలుకు వెళ్లి రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. అవసరమైన వారికి న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఏపీపీ గొండు సత్యనారాయణ, న్యాయవాదులు ఆర్.కృష్ణంనాయుడు, తూలుగు మధు, డి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పలాసకు చేరుకున్న పుస్తకాలు



లారీ నుంచి పుస్తకాలను దించుతున్న దృశ్యం

కాశీబుగ్గ: ప్రభుత్వం సరఫరా చేస్తున్న నోట్ పుస్తకాలు శనివారం మండలానికి చేరాయి. పలాస మండలం, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి పది ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పది ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుకుంటున్న 3,975 మంది విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9, 10 తరగతులకు అందించడానికి 46,746 నోట్‌బుక్‌లు వచ్చాయి. వీటిని స్థానిక పీఏసీఎస్ గోదాంలో భద్రపరిచారు. మండల విద్యాశాఖాధికారి చెరుకుపల్లి సత్యం, సీఆర్పీలు పోతనపల్లి బాలరాజు, ఉర్నాన అప్పలరాజు పరిశీలించారు.

నారాయణ తిరుమలలో..



నారాయణ తిరుమలలో పూజలందుకున్న స్వామివారు



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వెంకటేశ్వరులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక గుజరాతీపేటలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం స్వామి దర్శనాల కోసం భక్తులు అధికంగా తరలివచ్చారు. స్వామికి ప్రత్యేక అష్టోత్తర శతనామాలతో పూజలు, ప్రత్యేక దర్శనాలు, ఉచిత దర్శనాల భక్తులతో ఆలయం రద్దీగా మారింది. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించి, పూజలు నిర్వహించారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. అలాగే పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. అర్చకులు బూరాడ వంశీ ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఉదయం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు నగర సంకీర్తనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని కింతలమిల్లు జంక్షన్ వద్ద నున్న కనక మహాలక్ష్మి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఇక్కడ ఉన్న అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

వర్షంతో ఊరట...



ఎల్.ఎన్.పేట: నల్లగా కమ్మేసిన మేఘాలు

సరుబుజ్జిలి: మండలంలో శనివారం సాయంత్రం వర్షం కురవడంతో ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో నీరునిల్వ చేరింది.

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షంతో ఊరట లభించింది. శనివారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మబ్బులు రావడంతో పాటు వాతావరణం చల్లగా మారింది. కొంత సమయం తర్వాత ఎండ వచ్చినప్పటికీ సాయంత్రానికి మేఘాలు నల్లగా కమ్మేసి వర్షం కురవడం ప్రారంభం అయింది. వర్షంతో వంశధార నదీతీర గ్రామాలైన దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి, లక్ష్మీనర్సుపేట, బసవరాజుపేట తదితర గ్రామాల్లో కోత కోసిన హైబ్రీడ్ పెసర పంటకు నష్టం జరిగిందని బాధిత రైతులు తెలిపారు. వేసవి దుక్కులకు వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు వివరించారు.

బూర్జ: మండలంలో శనివారం సాయంత్రం కొద్దిపాటి వర్షం కురిసింది. దీంతో ప్రజలు వేడిమి నుంచి ఊరట పొందారు. వర్షం పెరిగితే దుక్కులు చేసుకోవచ్చని రైతులు అభిప్రాయపడ్డారు.



ఎల్.ఎన్.పేట: తురకపేటలో కురుస్తున్న వర్షం



సరుబుజ్జిలి: పీహెచ్‌సీ ఆవరణలో చేసిన వర్షపునీరు